క్లుప్తంగా

కుక్కడం గౌడ సంఘం అధ్యక్షుడిగా కాశీంగౌడ్



ఎన్నికలో పాల్గొన్న గౌడ కులస్తులు

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడం గ్రామంలో ఆదివారం నూతన గౌడ సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్దెల కాశీం గౌడ్, సభ్యులుగా మద్దెల పెదగాని సోమయ్య, బింగి సోమయ్య, బొమ్మెర వెంకన్న, మద్దెల యాకయ్య, శిలివేరు ముత్తయ్య, తాళ్ల లింగయ్య, మద్దెల సోమయ్య, మునిగుంపుల ప్రభాకర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కాశీం మాట్లాడారు. గౌడ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దెల రామనర్సు, మద్దెల భిక్షపతి, జలగం అచ్చయ్య, అంజయ్య, శిలివేరు వెంకన్న, బింగి వీరయ్య, మద్దెల మలయ్య, మద్దెల ముత్తయ్య, బొమ్మెర నాగయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు బహిరంగ సభ

దురాజ్‌పల్లి : ప్రజా సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లేలా సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారని పేర్కొన్నారు. పేదల సమస్యల పరిష్కారం కోసం బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సభకు ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మాజీ శాసన సభ్యుడు గుమ్మడి నర్సయ్య, పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు రమా, రాష్ట్ర నాయకులు జి.వెంకటేశ్వర్‌రావు తదితరులు హాజరవుతున్నట్లు పెర్కొన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి

అర్వపల్లి : రెండో విడత గొర్రెల పంపిణీలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ సోమవారం జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం జిల్లా సహాయకార్యదర్శి వజ్జె వినయ్‌యాదవ్ కోరారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చలో హైదరాబాద్ సందర్భంగా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని గొల్లకురుమలు ముట్టడించనున్నారని చెప్పారు. ఈ సమావేశంలో తుంగతుర్తి మండల అధ్యక్షుడు వీరబోయిన రాములు, గుండాల లింగయ్య, యాదగిరి, వీరయ్య, అంజయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

నూతనకల్ : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఇందిర ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు వివరాలతో సకాలంలో హాజరుకావాలని కోరారు.

రూ.60 వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న జాజిరెడ్డిగూడెం ట్రాక్టర్ యూనియన్ నాయకులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడేనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బొడ్డు బాలస్వామి ఇటీవల గ్రామంలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే అతడు నిరుపేద కుటుంబీకుడు కావడంతో వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్నాడు. దీంతో గ్రామస్తులు అతడికి తమ వంతు ఆర్థికసాయం చేశారు. గ్రామానికి చెందిన ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.52 వేలు, మాజీ ఎంపీటీసీ నర్సింగ శ్రీనివాస్‌గౌడ్ రూ. 4వేలు, గుడిపల్లి మధూకర్‌రెడ్డి రూ.4 వేల చొప్పున మొత్తం రూ.60 వేల నగదును ఆదివారం ఆస్పత్రిలో బాలస్వామికి అందజేశారు.

కోదాడ మున్సిపల్ కమిషనర్ ఆకస్మిక బదిలీ

కోదాడ : మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డిని ప్రభుత్వం ఆదివారం ఆకస్మికంగా బదిలీ చేసింది. మరో రెండు మూడు రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తుందనగా ఆయన బదిలీ కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఆయనను నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కోదాడ మున్సిపల్ కమిషనర్‌గా సీడీఎంఏలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరనాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

కోదాడ : అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చే లోపే ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడుగుల సైదులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సీపీఎస్ రద్దు చేయాలని ఉద్యోగులు శాంతియుతంగా ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం సమస్య పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు.

నిర్వహణ లేక.. నిరుపయోగం

- శిథిలావస్థలో నీటి తొట్లు
- పశువులకు అందని తాగునీరు
- వినియోగంలోకి తేవాలని రైతుల వినతి

చివ్వెంల : మండలంలోని గ్రామాల్లో ఆరేళ్ల క్రితం ఉపాధిహామీ ద్వారా నిర్మించిన నీటితొట్టిలు నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. పలు గ్రామాల్లో నీటితొట్ల వెంబడి పిచ్చిమొక్కలు మొలిచాయి. నీటితొట్లు శిథిలావస్థకు చేరుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. నిర్మించిన తొట్లు ఉపయోగపడుతున్నాయా.. పశువులకు తాగునీరు అందిస్తున్నామా.. అని అధికారులు పరిశీలించిన దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదు. మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటివరకు 15 గ్రామాల్లో నీటితొట్లు ఏర్పాటు చేశారు. ఒక్కో నీటితొట్టికి రూ.24 వేల నిధులు కేటాయించి నిర్మించారు. కానీ ఆ తర్వాత వాటి నిర్వహణను అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోవడం లేదు. శిథిలావస్థకు చేరుతున్న నీటి తొట్లను ఇప్పటికైనా శుభ్రపరిచి, నీటి వసతి కల్పించి వినియోగంలోకి తేవాలని పలువురు రైతులు కోరుతున్నారు.



పాశ్యానాయక్ తండాలో శిథిలావస్థకు చేరిన పశువుల నీటితొట్టి

వినియోగంలోకి తీసుకురావాలి

ప్రభుత్వం పశువుల కోసం నిర్మించిన నీటితొట్లను అధికారులు వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి. ఎండాకాలంలో పశువులకు తాగునీటికి ఇబ్బందిగా ఉంటది. అధికారులు స్పందించి నీటి తొట్టిలను శుభ్రం చేయించాలి. వాటిలో నీరు నింపాలి.

– ధరావతు కృష్ణ, పాశ్యానాయక్ తండా

పిచ్చి మొక్కల మధ్య దర్శనం

పశువుల తాగునీటి కోసం నిర్మించిన నీటి తొట్ల నిర్వహణ సరిగా లేకపోవడంతో గ్రామాల్లో తొట్లు పిచ్చిమొక్కల్లో దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరాయి. వేసవిలో పశువులకు తాగునీటికి రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– కొండ వెంకన్న, రైతు, వట్టిఖమ్మంపహాడ్

మాదిగలకే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

తిరుమలగిరి : కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్‌కు మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులకు ఇవ్వాలని ఆ పార్టీ నాయకుడు గూడెపు నాగరాజు కోరారు. ఆదివారం తిరుమలగిరిలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో మాదిగ సామాజిక వర్గానికి 60 వేల ఓట్లు ఉన్నాయని అన్నారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ మాదిగ సామాజిక వర్గం అభ్యర్థికే టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు గంగరాజు, లింగమల్లు, కొండా నవీన్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

రెండో విడత సబ్సిడీ గొర్రెల పంపిణీ

అర్వపల్లి : రెండో విడతలో మంజూరైన 12 గొర్రెల యూనిట్లను మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ ఆదివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గొల్ల కురుమలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ సబ్సిడీపై గొర్రెల యూనిట్లను అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి. అర్జున్, అర్వపల్లి దేవస్థాన డైరెక్టర్ మెండె సురేష్, లొడంగి లింగరాజు, కసన బోయిన రాజు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ

మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ



తిరుమలగిరి : బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాగంటి అనసూయ



నాగారం : ఈటూరులో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ, వైస్‌ఎంపీపీ



నాగారం : పసునూర్‌లో బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సాలయ్య

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో కౌన్సిలర్ చాగంటి అనసూయరాములు ఆదివారం బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేరిపోతుల బాబు గౌడ్, మెరుగు వెంకన్న, ఆర్‌పీలు సుకన్య, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం దసరా కానుకగా ఆడపడుచులకు బతుకమ్మ చీరలను అందజేస్తోందని ఎంపీపీ కూరం మణివెంకన్న, వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాల అన్నారు. ఆదివారం ఈటూరులో మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసి మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. అలాగే క్రీడాకారులకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. పసునూర్‌లో సర్పంచ్ వేర్పుల సాలయ్య, ఎంపీటీసీ ఏగూరు మంజుల మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పేరాల సరితయాదగిరి, కార్యదర్శులు భవాని, శ్రీలత, వార్డు సభ్యులు, ఆయా గ్రామాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవ సభకు తరలిన నాయకులు



ఆత్మకూర్ (ఎస్) : హైదరాబాద్ సభకు తరలివెళ్తున్న ముదిరాజ్ నాయకులు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం నుంచి..

ఆత్మకూర్ (ఎస్) : సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించిన ముదిరాజ్ ఆత్మగౌరవ సభకు మండల పరిధిలోని ముదిరాజ్‌లు ఆదివారం భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ముదిరాజ్ సామాజిక వర్గ ప్రజలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు అందడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో చక్కల వీరభద్రయ్య, సిరికొండ సురేష్, నీలం కృష్ణ, జంగ వెంకటేశ్వర్లు, చెక్కల నాగరాజు, కోల కర్ణాకర్, జొర్క లింగయ్య, సారగండ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జాజిరెడ్డిగూడెం మండలం నుంచి..

అర్వపల్లి : హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ముదిరాజుల ఆత్మగౌరవ సభకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి ముదిరాజులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. అంతకు ముందు గ్రామాల్లో ర్యాలీలు జరిపి ముదిరాజ్ జెండాలను ఎగురవేశారు.

బహుజన విప్లవ వీరుడు సర్వాయి పాపన్న

నాగారం : దేశంలో మొఘల్ రాచరికానికి వ్యతిరేకంగా పోరాడిన బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని స్థానిక ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని ఈటూరులో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బహుజనుల ఆత్మగౌరవానికి ప్రతీక పాపన్నగౌడ్ అని కొనియాడారు. పాపన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువత పాపన్న స్ఫూర్తితో ముందుకు సాగి, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రిసోర్స్ సెంటర్ డైరెక్టర్ బండి సాయన్న, సినీ హీరో పంజాల జైహింద్‌గౌడ్, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ గుండగాని అంబయ్యగౌడ్, సర్పంచ్ పేరాల సరితయాదగిరి, యారాల రాంరెడ్డి, పొదిల రమేష్, కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గొడిశాల వీరేందర్‌గౌడ్, మొగుళ్ల రమేష్‌గౌడ్, రవీందర్‌గౌడ్, బండి మహేష్, మొగుళ్ల అమరేందర్, బండి వెంకటేశ్వర్లు, చిల్లర చంద్రమౌళి, యాదగిరి, అంజయ్య, దోమల బాలమల్లు, ఎర్ర యాదగిరి, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిషోర్

ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

అర్వపల్లి : మండల పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామ కాంగ్రెస్ నాయకుడు పాశం లక్ష్మీకాంతరెడ్డి ఆదివారం తన అనుచరులతో తిరుమలగిరిలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కిషోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మన్నె లక్ష్మీనర్సయ్యయాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, రమేష్, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సలహాల్లేవ్.. సూచనల్లేవ్!

- క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించని వ్యవసాయ విస్తరణ అధికారులు
- సాగులో రైతులకు అందని సలహాలు, సూచనలు
- ఇష్టారీతిన పంటలను సాగు చేసి నష్టపోతున్న కర్షకులు

పెన్‌పహాడ్ : గ్రామాల్లో రైతులకు సాగులో ఆధునిక పద్ధతులు, సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రభుత్వం వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓ) నియమించింది. పెన్‌పహాడ్ మండలంలో 148ఎకరాల్లో రైతులు సాగు చేస్తున్నారు. ఇలా మండలంలోని ప్రతి మూడు వేల ఎకరాలకు ఒక ఏఈఓ చొప్పున మొత్తం నలుగురు ఏఈఓలను ప్రభుత్వం నియమించింది. కానీ క్షేత్ర స్థాయిలో ఏఈఓల జాడ కనబడడం లేదు. తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించి పొలాల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడాలని, పంటలకు వ్యాపిస్తున్న చీడ, పీడలను పరిశీలించాలని ప్రభుత్వం వారికి సూచించింది. గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి పంటల సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొంది. కానీ ఇవేవి తమకు పట్టనట్లుగా మండల వ్యవసాయ శాఖ వ్యవహరిస్తోంది. ఇంత జరుగుతున్నా జిల్లా అధికారులు కూడా పట్టించుకోవడం లేదని మండల పరిధిలోని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు.



చీడ పట్టిన కంది చేను

సూచనలు ఇవ్వడం లేదు

వ్యవసాయ భూముల్లో ఏ పంట వేయాలి, ఆయా పంటల సాగులో ఏ మెళకువలు పాటించాలనే దానిపై అధికారులు సూచనలు చేయలేదు. అధికారులు సలహాలు ఇస్తారని మాకు తెలియదు. ఇప్పటి వరకు మాకు తోచినట్లే వ్యవసాయం చేస్తున్నాం.

– వెంకన్న, రైతు, సింగారెడ్డిపాలెం

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కోదాడరూరల్ : పట్టణ పరిధిలోని బండపాలెం 3వ వార్డులో ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు రూ.4లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను కౌన్సిలర్ సామినేని నరేష్, కనగాల రాధాకృష్ణ ఆదివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. మిగతా నిధులు మంజూరు చేయించి మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ సోషల్‌మీడియా కోఆర్డిటర్ షేక్.జానీ, షేక్.మౌలానా, ఖాసీం, సామినేని వెంకటేశ్వర్లు, వెన్నబోయిన సూరయ్య, దంతాల వెంకటేశ్వర్లు, జిన్ను, చిన్న వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చిలుకూరు : రామాపురం గ్రామంలో ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిధులు రూ.9లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను ఆదివారం వైస్ ఎంపీపీ జనపనేని జానకీకృష్ణారావు, గ్రామ సర్పంచ్ మీసాల గంగాలింగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనులను త్వరితగతిన నాణ్యతగా పూర్తి చేయాలని అన్నారు. గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కీత వెంకటేశ్వర్లు, నాయకులు రాయభారపు వెంకటేశ్వర్లు, వేమూరి శ్రీనివాస్‌రావు, హస్న, నాగేశ్వరరావు, లక్ష్మణ్, సత్యనారాయణ, వెంకయ్య, వీరయ్య, పాపారావు, సత్యం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బంతిపూల తోటల సాగుతో ఉపాధి

- జాజిరెడ్డిగూడెం మండలంలో 20ఎకరాలకు పైగానే సాగు
- బతుకమ్మ పండుగకు మంచి గిరాకీ

అర్వపల్లి : బంతిపూల తోటల సాగుతో రైతులు మంచి లాభాలు గడిస్తున్నారు. గతంలో స్థానికంగా రైతులు బంతిపూల తోటలు సాగు చేయకపోవడంతో ఈ పూలు అవసరమైనవారు పట్టణాలకు వెళ్లి కొనుగోలు చేసుకొచ్చేవారు. ప్రస్తుతం గ్రామగ్రామాన ఈ బంతిపూల తోటలు సాగు చేస్తున్నారు. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా బంతి తోటలు 20ఎకరాలకు పైగానే ప్రస్తుతం సాగవుతున్నాయి. బతుకమ్మ పండుగకు ఈ పూలకు ఎంతో గిరాకీ ఉంటుంది.

విరబూసిన బంతిపూలు..

జాజిరెడ్డిగూడెం మండలంలోని పర్సాయపల్లి, అర్వపల్లి, జాజిరెడ్డిగూడెం, కొమ్మాల, కాసర్లపహాడ్, అడివెంల, కోడూరు గ్రామాలతోపాటు కొన్ని తండాల్లో రైతులు ఈ బంతి తోటలను సాగు చేశారు. ఈ తోటలకు ఏడాదికి మూడుసార్లు పూలు పూస్తాయి. అయితే బతుకమ్మ పండుగకు ముందు పూసే పూలకు మంచి గిరాకీ ఉంటుంది. బతుకమ్మలకు బంతిపూలు ఎక్కువగా వాడుతుండటంతో మహిళలు పెద్ద మొత్తంలో ఈ పూలను కొనుగోలు చేస్తారు. ఈ సమయంలో ఈ పూలకు ధర ఎక్కువగా పెరుగుతుంది. మిగిలిన సమయాల్లో ఈ పూలను ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాలకు ఉపయోగిస్తుంటారు. కాగా బంతి నారును ఏపీలోని చిల్లకల్ తదితర ప్రాంతాల నుంచి రైతులు తెచ్చి ఈ తోటలు సాగు చేస్తున్నారు. అయితే గోదా వరి జలాలు వస్తుండటంతో ఎక్కువ మంది రైతులు ఈ తోటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండల పరిధిలోని పర్సాయపల్లిలో జవాజి భద్రయ్య అనే రైతు అర ఎకరం భూమిలో గత కొన్నేళ్లుగా ఈ బంతిపూలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రైతు తోటలో ఆరెంజ్, పసుపుపచ్చని రంగుల ముద్దబంతి పూలు విరబూసాయి. రోడ్డు వెంట వెళ్లే ప్రయాణికులు ఈ పూల తోటను ఆసక్తిగా తిలకిస్తున్నారు.




పర్సాయపల్లిలో సాగులో ఉన్న బంతిపూల తోట



అర్వపల్లిలో..

అర ఎకరం భూమిలో సాగు


అర ఎకరం భూమిలో బంతి తోట సాగు చేశాను. గోదావరి జలాలతో బంతిపూల తోటలు సాగు చేస్తున్నా. ప్రతి సీజన్‌లో ఈ తోటతో రూ. 30వేల వరకు ఆదాయం పొందుతున్నా. బతుకమ్మ పండుగకు ఈ పూలకు మంచి గిరాకీ ఉంటుంది.



- జవాజి భద్రయ్య, రైతు, పర్సాయపల్లి

కొత్తగా బంతి తోట వేశా

ఈ ఏడాది కొత్తగా బంతి పూల తోట సాగుచేశా. తొలుత 10 గుంటల్లో పూలతోట సాగుచేయగా మంచి దిగుబడి వస్తోంది. దీంతో మళ్లీ రెండు ఎకరాల్లో బంతితోట సాగుచేయడానికి ఏర్పాట్లు చేస్తున్నా.



- సాయిని మాధవ్, అర్వపల్లి

తేలిన 'తుంగతుర్తి' ఓటర్ల లెక్క

- నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,48,556 మంది

తిరుమలగిరి : త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండడంతో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను ప్రకటించింది. తుంగతుర్తి నియోజకవర్గంలో మొత్తం 2,48,556 మంది ఓటర్లు ఉండగా పురుష ఓటర్లు 1,24,826 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 1,23,722 మంది, ఇతరులు 8 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం 323 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 9 మండలాల్లో నాగారం, అడ్డగూడూరు మండలాల్లో పురుషుల కంటే మహిళలు అధికంగా ఉన్నారు. మోత్కూరు, తుంగతుర్తి, మద్దిరాల, జాజిరెడ్డిగూడెం, శాలిగౌరారం, తిరుమలగిరి మండలాల్లో పురుష ఓటర్లు అధికంగా ఉన్నారు.

పెరిగిన ఓటర్లు..

గత ఆగస్టులో విడుదల చేసిన ఓటరు జాబితాలో తుంగతుర్తి నియోజకవర్గంలో 2,40,104 మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం నియోజకవర్గంలో కొత్తగా 8,452 మంది ఓటర్లు పెరిగారు.



ఓటర్ల దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

మండలాల వారీగా ఓటర్ల వివరాలు..

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
తుంగతుర్తి	16519	16076	32595
శాలిగౌరారం	19268	19239	38510
మోత్కూరు	13218	13194	26412
అడ్డగూడూరు	10995	11172	22167
నూతనకల్	13906	13558	27464
మద్దిరాల	12100	11921	24022
నాగారం	11441	11443	22887
జాజిరెడ్డిగూడెం	11589	11577	23167
తిరుమలగిరి	15790	15542	31332

కొనసాగుతున్న ఆశా కార్యకర్తల నిరసన



అర్వపల్లిలో నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

అర్వపల్లి : ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాన్ని అమలు చేయాలని కోరుతూ ఆదివారం ఆశా కార్యకర్తలు అర్వపల్లిలో 365బీ జాతీయ రహదారిపై నిరసన తెలిపారు. ఫిక్స్‌డ్ వేతనం రూ.21వేలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పగిడిమర్రి పద్మ, ఎస్.జ్ఞానసుందరి, ఆశా కార్యకర్తలు మనీల, బి.సైదమ్మ, సుజాత, కవిత, నాగమ్మ, సైదమ్మ, స్వరూప, అరుణ పాల్గొన్నారు.

భారీ వాహనం తగిలి తెగిన విద్యుత్ వైర్లు



రోడ్డుపై తెగిపడిన విద్యుత్ వైర్లు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలో సూర్యాపేట–జనగామ 365బీ జాతీయ రహదారిపై ఆదివారం 96 టైర్ల భారీ వాహనం వెళ్లింది. ఈ వాహనంపై హైదరాబాద్‌లోని మియాపూర్ నుంచి ఏపీలోని విశాఖపట్నంలోని ఐఓసీఎల్ కంపెనీకి భారీ బాయిలర్‌ను తీసుకెళ్తున్నారు. ఈ బాయిలర్ ఎత్తుగా ఉండటంతో అర్వపల్లి వైజంక్షన్‌లో సెంట్రల్ లైటింగ్ విద్యుత్ లైను వైర్లకు తగిలింది. దీంతో వైర్లు తెగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. ఆ సమయంలో ఎవరూ తీగలకు సమీపంలో లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది వెంటనే వైర్లను సరిచేయించారు. ఈ హైవేపై భారీ వాహనాల రాకపోకలను నిషేధించాలని ప్రజలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆలయం వద్ద అన్నదానం

మద్దిరాల : కుక్కడంలోని ముత్యాలమ్మ ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా తీసిన వడిబియ్యాన్ని ఆదివారం వండారు. అలాగే గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సర్పంచ్ గుండ్ల కొమరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులకు భోజనాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బీసు పూలమ్మ వీరన్న, మద్దెల సోమయ్య, జలగం అచ్చయ్య, బొమ్మెర వెంకన్న, మద్దెల రాములు, పూర్ణయ్య, రాపోలు నాగయ్య, మద్దెల కాశీం, చామకూరి లింగయ్య, శిలివేరు చిరంజీవి, బీసు రవి, వెన్నెమల్ల భాస్కర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సర్పంచ్ గుండ్ల కొమరయ్య

అర్హులకు దళితబంధు అందించాలి

మునగాల : అర్హులకు దళిత బంధు అందించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని బరాఖత్‌గూడెం గ్రామస్తులు ఆదివారం గ్రామంలోని జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్ తనకు అనుకూలంగా ఉండే 11మంది వ్యక్తులకు దళితబంధును కేటాయించినట్లు ఆరోపించారు. మాలాంటి పేద కుటుంబాలకు దళితబంధు కేటాయించకపోవడం సమంజసం కాదని వాపోయారు. ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చొరవ తీసుకొని అర్హులకు దళిత బంధు యూనిట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లేపల్లి దుర్గాప్రసాద్, పోకల నాగయ్య, జిల్లేపల్లి సంధ్య, యాంపంగి సావిత్రమ్మ, యాంపంగి మరియమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వాలు

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు

మునగాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బుర్రి శ్రీరాములు అన్నారు. ఆదివారం మండలంలోని కలకోవలో పార్టీ మండల కమిటీ సభ్యురాలు కుంభజడ వెంకటకోటమ్మ అధ్యక్షతన జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ రాజకీయ విలువలను దిగజారుస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీతో ఒప్పందం చేసుకొని విధానాలు లేని పద్ధతిలో రాజకీయాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతుందని ఆరోపించారు. అవినీతి అరాచకాలను పెంచి పోషిస్తూ, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతూ రాజకీయ విలువలను దిగజారుస్తుందని అన్నారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు చందా చంద్రయ్య, అనంతు గుర్వయ్య, షేక్ సైదా, మండవ వెంకటాద్రి, సురభి వెంకటనారాయణ, పాతకొట్ల లింగయ్య, కొంపెల్లి లింగయ్య, గన్నా వెంకటేశ్వరరావు, మండవ లింగయ్య, మండవ వెంకట్రావమ్మ, మండవ పార్వతమ్మ, సురభి రేణుక తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు